స్థిరాస్తికి రక్షణ ఏదీ ?

- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అవినీతి దందా
- ఇష్టారాజ్యంగా డబుల్ రిజిస్ట్రేషన్లు
- అక్రమ రిజిస్ట్రేషన్ల వెనుక ధనం, రాజకీయం
- ఆరోపణలున్న వారికే కీలక సీట్లు
- రిజిస్ట్రేషన్ రద్దుపై చేతులెత్తేస్తున్న ఉన్నతాధికారులు

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రిజిస్ట్రేషన్ కార్యాలయాలు అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారాయి. ఒకరి పేరుతో ఉన్న ఆస్తిని సరైన ఆధారాలు లేకుండా నకిలీ డాక్యుమెంట్లు, తప్పుడు పత్రాలతో సంబంధం లేని వ్యక్తుల పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారు. ఇందుకుగాను సబ్‌రిజిస్ట్రార్లకు పెద్ద మొత్తంలో డబ్బు ముట్టజెపుతున్నారు. డబుల్ రిజిస్ట్రేషన్ చెల్లకపోయినా రద్దు చేసే అవకాశం లేకపోవడంతో వారు రెచ్చిపోతున్నారు. కనీసం బేరానికి వచ్చి అయినా ఎంతో కొంత ముట్టజెబుతారనో.. లేక మొత్తం ఆస్తి అంతా తమ వశమవుతుందనో కొందరు బరితెగిస్తున్నారు. ఈ విషయంలో రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు ఏమీ చేయలేమంటూ చేతులెత్తేస్తున్నారు. దీంతో అసలైన హక్కుదారులు బాధితులుగా మారి గగ్గోలు పెడుతున్నారు.


అనంతపురం రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

డబుల్ రిజిస్ట్రేషన్లు ఇలా...

● అనంతపురానికి చెందిన నాగమణి హౌసింగ్ బోర్డు సమీపంలోని రూ.60లక్షల విలువైన ఇంటిని ఓ వ్యక్తికి విక్రయించింది. సంబంధిత ఆస్తి రిజిస్ట్రేషన్ ఎనీవేర్ కింద ధర్మవరం సబ్‌రిజిస్ట్రార్ చేశారు. అదే ఆస్తిని ఆ మహిళ తన సమీప బంధువుకు విక్రయించింది. ఇందులో గమ్మతేమిటంటే... ఆ ఆస్తికి ధర్మవరంలో రిజిస్ట్రేషన్ చేసిన సబ్ రిజిస్ట్రారే బదిలీపై అనంతపురం వచ్చారు. ఇక్కడ కూడా ఆయనే రిజిస్ట్రేషన్ చేశారు. ఈ విషయంపై బాధితుడు రిజిస్ట్రేషన్ శాఖ జిల్లా రిజిస్ట్రార్, డీఐజీలకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది.

● అనంతపురం నగరంలోని సాయినగర్‌లో ఉన్న రూ.1.3కోట్ల ఆస్తి డబుల్ రిజిస్ట్రేషన్ విషయంలో వివాదం నెలకొంది. ఆరో క్రాస్‌లోని రెండు దుకాణాలను యజమాని ప్రదీప్ తొలుత 2004లో డాక్టర్ షరీఫ్‌కు విక్రయించాడు. ఇదే ఆస్తిని ప్రదీప్ 2005లో శివశంకర్ అనే వ్యక్తికి రిజిస్ట్రేషన్ చేయించాడు. ఈ విషయంపై షరీఫ్ భార్య రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ విజయలక్ష్మికి ఫిర్యాదు చేశారు. అయితే దీనిపై తామేమీ చేయలేమని చెప్పారని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రిజిస్ట్రేషన్ రాజకీయంగా తీవ్ర దుమారం రేపింది.

● అనంతపురం రూరల్ మండలం నారాయణపురంలో కృష్ణ, అనసూయ దంపతులకు చెందిన భూమిని మరొకరి పేరుతో డబుల్ రిజిస్ట్రేషన్ చేయించారు. దీనికి అనంతపురం రామ్‌నగర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వేదికైంది. కనగానపల్లి మండలం ముత్తువకుంట్లకు చెందిన ముకుందనాయుడు, పద్మగీత దంపతుల పేర్లతో 1.18 ఎకరాలు డబుల్ రిజిస్ట్రేషన్ చేశారు.

● బుక్కరాయసముద్రం మండలంలోని ఓ గ్రామంలో రూ.3కోట్ల విలువైన 1.10ఎకరాల భూమి డబుల్ రిజిస్ట్రేషన్ చేశారు. ఈ భూమికి సంబంధించి ఇరువర్గాలు కోర్టుకెక్కాయి.

● అనంతపురం చుట్టుపక్కల ప్రాంతాల పరిధిలో పాపంపేటలో 29ఎకరాలతో పాటు కొన్ని భూములు జీపీ పేరుతో చేయించుకున్న వాటిని డబుల్ రిజిస్ట్రేషన్ చేయించారనే ఆరోపణలున్నాయి.

● ఉమ్మడి జిల్లాల పరిధిలో కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలోనూ డబుల్ రిజిస్ట్రేషన్లు చేయించినట్లు సమాచారం. అయితే బాధితులు బయటకు రాకపోవడంతో, విషయాలు (మిగతా 6లో)

నకిలీ దందా..!

ఆధార్ అప్‌డేట్ కోసం నకిలీ బర్త్ సర్టిఫికెట్లు

- పలు ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల నుంచి జారీ
- కాసుల కక్కుర్తితో కొందరు సిబ్బంది ఆగడాలు
- ఆధార్ సెంటర్ నిర్వాహకులకు తప్పని తిప్పలు
- నియంత్రించడంలో అధికార యంత్రాంగం విఫలం


ఆధార్ అప్‌డేట్ కోసం వేచి ఉన్న ప్రజలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నకిలీ బర్త్ సర్టిఫికెట్ల దందా జోరుగా సాగుతోంది. నిబంధనల మేరకు వెళ్తే ఆలస్యం అవుతుందన్న కారణంతో కొందరు ప్రజలు భవిష్యత్తులో వచ్చే ఇబ్బందులను ఊహించలేక ఈ నకిలీ సర్టిఫికెట్ల వైపు మొగ్గు చూపుతున్నారు. సంబంధిత అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడం వల్లే నకిలీ బర్త్ సర్టిఫికెట్ల జారీ యథేచ్ఛగా సాగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఫేక్ వెబ్‌సైట్లతో నకిలీ బర్త్ సర్టిఫికెట్లు

ప్రభుత్వ నిబంధనల మేరకు సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ లింకులో బర్త్ సర్టిఫికెట్లు అందుతాయి. ఇలాంటి వెబ్‌సైట్ల ద్వారా కొందరు కేటుగాళ్లు నకిలీ బర్త్ సర్టిఫికెట్లు ఇస్తూ, సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికే జిల్లా కేంద్రంతో పాటు రాయదుర్గం, కళ్యాణదుర్గం, తాడిపత్రి, మడకశిర, పెనుకొండ తదితర ప్రాంతాల్లోని పలువురు నెట్‌సెంటర్లలో ఈ ఫేక్ వెబ్‌సైట్లతో నకిలీ సర్టిఫికెట్లను బయటికి తీస్తున్నట్లు సమాచారం. పలు ఆస్పత్రుల నుంచి తెచ్చుకున్న పుట్టిన తేదీ పత్రంతో ఆన్‌లైన్‌లో అప్లై చేసి నిమిషాల్లో బర్త్ సర్టిఫికెట్లు ఇస్తున్నారు. వీటివల్ల భవిష్యత్తులో జరిగే (మిగతా 6లో...)

మంత్రి లోకేశ్ పర్యటనకు ఏర్పాట్లు

పరిశీలించిన ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

అధికారులతో సమీక్ష


అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఈనెల 7, 8 తేదీల్లో కళ్యాణదుర్గం నియోజకవర్గానికి విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వస్తున్న నేపథ్యంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సోమవారం ఏర్పాట్లను పరిశీలించారు. ఆర్డీవో వసంతబాబు, డీఎస్పీ రవిబాబు, మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్, ట్రాన్స్‌కో డీఈ రాజశేఖర్‌తో కలిసి ఎమ్మెల్యే సమీక్షించారు. కంబదూరులో రోడ్డు ఉన్న కనకదాస సర్కిల్‌లో ఏర్పాట్లపై అధికారులతో అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ సౌకర్యం, రాకపోకలు, తదితర ఏర్పాట్లను అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈనెల 7న కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం ఉంటుందని, పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలను లోకేశ్ సన్మానిస్తారని తెలిపారు. 8న కనకదాసు జయంతి సందర్భంగా పట్టణంలో నూతనంగా నిర్మించిన కనకదాసు విగ్రహాన్ని లోకేశ్ ఆవిష్కరిస్తారని వివరించారు. రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. కుందుర్పి రోడ్డులో సభా ప్రాంగణాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సొంత డబ్బులు ఖర్చు చేసి కనకదాసు విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. మరోవైపు టీడీపీ నాయకులు అవినాష్, గోపి కూడా మంత్రి లోకేశ్ పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు.

మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

ఏపీ బ్రాహ్మణ సేవా సంఘం సమైఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సూచించారు. సోమవారం పట్టణంలోని ప్రజావేదిక వద్ద మెగాజాబ్ మేళా బ్రోచర్‌ను ఆయన విడుదల చేశారు. డిసెంబరు 13న అమరావతిలోని హిందూ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో జాబ్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దాదాపు 50కి పైగా మల్టీనేషన్ కంపెనీలు వస్తున్నాయన్నారు. పదో తరగతి, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, బీ-ఫార్మసీ, ఎమ్-ఫార్మసీ చదివిన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చంద్రశేఖరా.. హరా..!

శివాలయాలకు కార్తీకశోభ


మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వర ఆలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు

అనంతపురం టౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఉన్న శైవాలయాలు సోమవారం హరనామ స్మరణతో మార్మోగాయి. కార్తీకమాసం రెండో సోమవారాన్ని పురస్కరించుకుని భక్తులు తెల్లవారు జాము నుంచే ఆలయాలకు పోటెత్తారు. దివ్వెలు వెలిగించి, పాహిమాం పరమేశ్వర అని పరమేశ్వర అని ప్రార్థించారు. ప్రమిదల వెలుగులు, భక్తుల ఓంకార నాదాలతో భక్తి తరంగాలు నలు చెరగుల విస్తరించాయి. సాయంత్రం పున్నమి వెలుగుల సాక్షిగా చంద్రశేఖరుడిని స్తుతించారు. ఆయా ఆలయాలను మాలధారులు, మహిళలు అధిక సంఖ్యలో సందర్శించారు. భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలు వెలిగిస్తూ నీలకంఠుడుని కొలిచారు.



ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

టమోటా కిలో రూ.22

అనంతపురం రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్లో సోమవారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.22తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్ఠంగా రూ.10తో, సరసరిగా రూ.16తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 1800 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

Anantapuramu-Hindupur Urban Development Authority (AHUDA)
e-Procurement Tender Notice
Tender Notice No.: 03/2025-26/AHUDA (2nd Call), 04/2025-26/AHUDA, 05/2025-26/ AHUDA తేదీ:03-11-2025 అహుడా పరిధి నందు చేపట్ట బోవు పనికి గాను ఆన్లైన్ టెండర్లను స్వీకరించబడును. తదుపరి వివరాలను ఇ- ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ https://tender.apeprocurement.gov.in నందు చూడవచ్చును.అంచనా విలువ:36.30 లక్షలు సెల్ నెం:8977753747
వైస్ ఛైర్ పర్సన్ (అహుడా),అనంతపురము

JAWAHARLAL NEHRU TECHNOLOGICAL UNIVERSITY ANANTAPURANANTHAPURAMU – 515 002 (A.P.) INDIA
TENDER NOTICE

1	NIT No. 01/JNTUA Wall Calendars, Desktop Planners and Telephone Directory for the year 2026, Date: 04.11.2025. Tenders are invited from reputed firms for the Designing , Printing & Supply of JNTUA Wall Calendars, Desktop Planners and Telephone Directory for the year 2026. For details visit the AP e-procurement portal https://tender.apeprocurement.gov.in with Tender ID : 860404.

Sd/- REGISTRAR

A.P EDUCATION & WELFARE INFRASTRUCTURE DEVELOPMENT CORPORATION
"e-procurement Tender Notice"
e-procurment Notice No. EE/APEWIDC/ANTP/NIT/2025-26, Dt: 03.11.2025 Tender NIT No's. 110 to 113/EE/APEWIDC/ ANTP/AE/2025-26, Dt: 03.11.2025 Tenders are invited for various works (4 No's) in this Division Est. cost Rs.1.00 Lakh to 40.00Lakhs. Start date of tender: 04.11.2025 at 3:00 P.M and last date and time for receipt of tender: 11.11.2025 at 04:30 P.M. Further detail can be seen at-e- procurement market place at. https://tender.apeprocurement.gov.in
Sd/- Executive Engineer, APEWIDC,ANANTHAPURAMU.

మాస్ నర్సింగ్ స్కూల్
(రాష్ట్ర ప్రభుత్వము మరియు భారత ప్రభుత్వంచే గుర్తింపు పొందినది)
ఈ-సేవా రోడ్డు, రామ్‌నగర్, అనంతపురము - 515 004.
సెల్: 76759 16716, 83330 38800
అడ్మిషన్లు జరుగుచున్నవి
G.N.M. (స్టాఫ్ నర్సు) జనరల్ నర్సింగ్ & మిడ్ వైఫరి కోర్సుకు (HEC, HEP, Bi.P.C., or any) ఏదైనా ఇంటర్మీడియేట్ పాసై ఉండాలి.
కోర్సుకాల వ్యవధి : 3 సం॥ 6 నెలలు
Free Hostel & Food, For 100% Placement in Multy Speciality Hospetals
బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఫీజు మినహాయింపు కలదు.
హాస్టల్ వసతి కలదు. అనుభవజ్ఞులైన ఆధ్యాపకులచే విద్యాబోధన

పాపంపేటలో భూములను కాపాడండి

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీ


మాట్లాడుతున్న జేసీ

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రూరల్ మండలంలోని పాపంపేటలో ఆక్రమణకు గురవుతున్న భూములను కాపాడాలని భూ బాధితుల నిజనిర్ధారణ కమిటీ కన్వీనర్ సాకే హరి జాయింట్ కలెక్టర్‌ను కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదికలో జేసీని కలిసి వినతి పత్రం అందజేశారు. పాపంపేట పొలంలో దాదాపు 130 సర్వేనెంబర్లలో 932 ఎకరాల భూమి ఉందని, అందులో 1910 నుంచే భూ క్రయ, విక్రయాలు మొదలై 1964లో నెల్లూరు సెటిల్‌మెంట్ జరిగిందన్నారు. అప్పటి నుంచి అనేక మంది చేతుల్లో భూములు మారాయన్నారు. కొందరు ఆక్రమణలకు ప్రయత్నిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అర్జీలను వేగంగా పరిష్కరించాలి

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు అందించిన అర్జీలను వేగంగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ ఆదేశించారు. ప్రజల నుంచి 435 అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, డీఆర్‌ఓ మలోల, డిప్యూటీ కలెక్టర్ ఆనంద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వర్మ తదితరులు పాల్గొన్నారు.

బాలల సంరక్షణ కేంద్రాలను తనిఖీ చేయాలి: జేసీ

అనంతపురం కలెక్టరేట్: జిల్లాలో ప్రస్తుతమున్న బాలల సంరక్షణ కేంద్రాలను సంబంధిత శాఖల అధికారులు తనిఖీ చేయాలని జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బాలల సంరక్షణ కేంద్రాల జిల్లా స్థాయి సిఫారసు కమిటీ సమావేశం సోమవారం జరిగింది. సమావేశంలో కమిటీ ఛైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి అరుణ, జిల్లా రిజిస్ట్రార్ భార్గవ్, వికలాంగుల సంక్షేమ శాఖ అధికారి అర్చన, డీపీఓ ఖలీల్, డీసీపీఓ మంజునాథ్, స్వచ్ఛంద సేవ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో జేసీ మాట్లాడుతూ జిల్లాలో చైల్డ్‌కేర్ ఇన్‌స్టిట్యూట్ల లైసెన్స్ కోసం 11మంది దరఖాస్తు చేసుకోగా, 10మందికి ప్రొవిజన్ రిజిస్ట్రేషన్ ప్రభుత్వ నిబంధనల మేరకు మంజూరు చేస్తామని తెలిపారు. గుంతకల్లు దరఖాస్తును పరిశీలించి, ఆ కేంద్రానికి సంబంధించి పూర్తి స్థాయిలో తనిఖీ చేయాలన్నారు. కేంద్రాల పనితీరుపై ఫిర్యాదులు రాకూడదని, వస్తే రద్దు చేస్తామని హెచ్చరించారు.

ముందస్తు ప్రణాళికతో భద్రతా చర్యలు

రాష్ట్రంలో వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన తొక్కిసలాట ఘటనల నేపథ్యంలో సంబంధిత శాఖాధికారులు జిల్లాలో ముందస్తు ప్రణాళికతో భద్రతా చర్యలు తీసుకోవాలని జేసీ ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో ఆయన సమావేశమయ్యారు. జిల్లాలో ప్రతి రోజు, ప్రతి నెల, ఆ సంవత్సరంలో జరిగే పెద్ద కార్యక్రమాలు, ఎక్కువ మంది ప్రజలు హాజరయ్యే వాటి వివరాలు ముందస్తుగా సేకరించి కలెక్టరేట్‌కు తెలిపాలన్నారు. అధిక జనం వచ్చేలా ఉంటే భద్రతా చర్యలపై దృష్టి పెట్టాలన్నారు.


పిటిషన్లను పరిష్కరించండి: ఎస్పీ


ఫిర్యాదును పరిశీలిస్తున్న ఎస్పీ

అనంతపురం క్రైం, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన పిటిషన్లను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా ఎస్పీ జగదీష్ సంబంధిత పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఆయన ప్రజల నుంచి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి 105 వినతులు స్వీకరించారు. ప్రజలతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను విన్నారు. తర్వాత సంబంధిత పోలీస్ అధికారులకు ఫోన్లు చేసి చట్టపరిధిలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. పీజీఆర్‌ఎస్‌లో వచ్చే పిటిషన్లకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు.



అభద్ర ఎగువ కాలువ..!


కూలిన హెడ్ రెగ్యులేటర్ గేట్లు

- వైసీపీ పాలకుల పాపం.. శిథిలావస్థలో హెచ్చెల్సీ
- కూలుతున్న వంతెనలు, గేట్లు
- బాగు చేయిస్తాం: ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు

బొమ్మనహాళ్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాకు జీవనాడి తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ). అలాంటి కాలువపై గత వైసీపీ పాలకులపై తీవ్ర నిర్లక్ష్యం వహించారు. కనసీ మరమ్మతులు చేయలేదు. నిర్వహణను గాలికొదిలేశారు. తమది రైతు ప్రభుత్వమని చెప్పుకున్న వైసీపీ పాలకులు.. సాగునీరు అందించే కాలువనే గాలికొదిలేశారు. ఫలితంగా కాలువ నిర్వీర్యమైపోయింది. వంతెనలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎప్పుడు కూలుతాయోనని జనం ఆందోళన చెందుతున్నారు. గేట్లు తుప్పు పట్టిపోయాయి. ఎక్కడ కొట్టుకుపోతాయోనని రైతులు వాపోతున్నారు. షట్టర్లు, హెడ్ రెగ్యులేటర్లకు కనీస మరమ్మతులు చేయించలేదు. ఫలితంగా మండలంలోని 116/399వ కిలోమీటరు వద్ద హెడ్ రెగ్యులేటర్ గేట్లు ఆదివారం రాత్రి కూలిపోయాయి. గత వైసీపీ పాలకులు.. కాలువకు పైసా కూడా కేటాయించకపోడవం ఈ దుస్థితికి కారణమని రైతులు మండిపడుతున్నారు. నీటి ప్రవాహం తగ్గితేగానీ గేట్లకు మరమ్మతులు చేయలేని దుస్థితి. ఈ ఏడాది నీటి వాటా ముగిసిన తర్వాత పనులు చేపట్టనున్నారు.

ఐదేళ్లలో నిధులు శూన్యం

వైసీపీ ఐదేళ్ల పాలనలో తుంగభద్ర ఎగువ కాలువకు పైసా కూడా నిధులు కేటాయించలేదు. వంతెనలు కూలిపోయి రైతులు నానా అవస్థలు పడినా పట్టించుకున్న పాపానపోలేదు. ప్రభుత్వం నిధులు మంజూరుచేస్తుందా.. లేదా.. అనే దానితో నిమిత్తం లేకుండా కాలువ నిర్వహణ, ఆధునికీకరణ పనులకు అధికారులు ప్రతిపాదనలు పంపారు. వాటిని నాటి పాలకులు కనీసం పట్టించుకున్న పాపాన పోలేదన్న విమర్శలు ఉన్నాయి. 2008లో ఆరు ప్యాకేజీలతో ఆధునికీకరణ పనులకు రూ.480 కోట్లు కేటాయించింది. 60శాతం పూర్తి చేశారు. గత వైసీపీ ప్రభుత్వం 2020లో పనులు ఐదేళ్లు చేయకూడదని ఏకంగా జీఓ విడుదల చేసింది.

కూటమి ప్రభుత్వంపై బాధ్యత

వైసీపీ నిర్లక్ష్యంతో నిర్వీర్యమైన హెచ్చెల్సీని కూటమి ప్రభుత్వం పునరుద్ధరించాల్సి ఉంది. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు.. కూలిపోయిన వంతెన, యూటీలు, లైనింగ్ పనలకు ఆత్యవసర మరమ్మతులు చేసేందుకు నిధులు తీసుకొచ్చారు. దర్గాహొన్నూరు, నాగలాపురం, ఉద్దేహాళ్ వద్ద పనులు చేయించారు. ప్రస్తుతం కూలిన హెడ్ రెగ్యులేటర్, శిథిలమైన యూటీలు, పాడైన నిర్మాణాలను పునఃనిర్మించడం ప్రభుత్వం ముందున్న బాధ్యత.

కాలువను పునరుద్ధరిస్తాం: ప్రభుత్వ విప్ కాలవ

గత వైసీపీ ప్రభుత్వం నీటిపారుదల రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. జిల్లాకు జీవనాడి అయిన హెచ్చెల్సీకి పైసా కూడా విడుదల చేయలేదు. కూటమి ప్రభుత్వం పరిస్థితిని అర్థం చేసుకుని చర్యలు ప్రారంభించింది. 11 పనుల ఆత్యవసర మరమ్మతులకు రూ.28.05 కోట్లు కేటాయించింది. ఆ మేరకు పనుల చేయించాం. హెచ్చెల్సీని బాగు చేస్తాం. కాలువ పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

ఆంధ్రజ్యోతికి వార్షికోత్సవ శుభాకాంక్షలు

పి.కుల్లాయిస్వామి MPDO	జి.రాజు Upgrade C.I.,	టి.గౌస్‌మొద్దీన్ A.E., Transco
సి.రమణయ్య A.E., PR	ఎస్.నాగదివ్య A.E., RWS	ఎం.పోలేరయ్య APO-NREGS
ఎం.డి. గౌస్ MEO-1	జి.శుభకర్ AO-Agri	సి.రాధాక్రిష్ణ Deputy MPDO

ఉపాధి హామీ సిబ్బంది | పంచాయతీ కార్యదర్శులు
కూడేరు మండలం.

క్రైం కార్నర్

అసభ్య ప్రవర్తనకు ఐదేళ్ల జైలు

అనంతపురం క్రైం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి ఐదేళ్ల జైలు, రూ. 10 వేల జరిమాన, బాధితురాలికి మరో రూ.10 వేల పరిహారం ఇవ్వాలని జిల్లా పోక్సో కోర్టు న్యాయాధికారి చిన్నబాబు సోమవారం తీర్పు వెలువరించారు. శ్రీసత్యసాయి జిల్లా తాడిమర్రి మండలం మరువపల్లికి చెందిన ముడియం అమర్నాథరెడ్డి (36).. 2022 ఏప్రిల్ 18న హైదరాబాద్ నుంచి అనంతపురానికి ఓ ప్రైవేట్ బస్సులో తల్లితో కలసి వస్తున్న ఐదేళ్ల బాలికతో అసభ్యంగా వ్యవహరించాడు. రాత్రి 2.30 గంటలప్పుడు అతడు బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో బాలిక తల్లి అమర్నాథరెడ్డిని అప్పటికప్పుడు తీవ్రంగా మందలించారు. అనంతపురంలో బస్సు దిగగానే.. మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. దీనిపై అప్పటి మహిళా ఎస్ఐ సులోచన దర్యాప్తు చేసి పోక్సో కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేశారు. పోక్సో కోర్టు న్యాయాధికారి చిన్నబాబు సాక్షులను విచారించారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి ఐదేళ్ల జైలు, రూ.10 వేల జరిమానా విధించారు. అదేవిధంగా బాధితురాలికి రూ.10 వేల పరిహారం కూడా చెల్లించాలని ఆదేశించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



చిలమత్తూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొడికొండ చెక్‌పోస్టు సమీపంలో రక్షా అకాడమి పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం సోమవారం లభ్యమైంది. అటుగా వెళ్లిన స్థానికులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతి చెందిన వ్యక్తి వయసు సుమారు 70 సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. వివరాలు తెలిస్తే సమాచారం ఇవ్వాలని ఎస్ఐ మునీర్ అహమ్మద్ కోరారు.

వృద్ధుడి అదృశ్యం


ఆదినారాయణ(ఫైల్)

కొత్తచెరువు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీసీ కాలనీకు చెందిన ఆదినారాయణ అనే వృద్ధుడు అదృశ్యమయ్యారు. తన తాత ఆదివారం నుంచి కనిపించడం లేదని ఆయన మనవడు మురళి సోమవారం ఫిర్యాదు చేశారని సీఐ మారుతీ శంకర్ తెలిపారు. ఆదినారాయణకు మతిస్థిమితం సరిగా లేదు. ఎక్కడైనా కనిపిస్తే 9440796838, 9160653665 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

కుక్కకాటు ప్రమాదకరం

గార్లదిన్నె, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కుక్క కాటు చాలా ప్రమాదకరమని గార్లదిన్నె పీహెచ్‌సీ వైద్యాధికారి ఉదయ్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుక్కకాటుకు గురైన వారికి ఆయన పలు సలహాలు ఇచ్చారు. కుక్కలు కరిస్తే చాలామంది తేలికగా తీసుకుంటున్నారని తెలిపారు. కుక్క కరవడం వల్ల రేబిస్ సోకే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇటీవల కుక్క కాటుకు గురై రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడాకారుడు మృతి చెందినట్లు గుర్తు చేశారు. కుక్క కరిస్తే నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. కుక్కకాటు గార్లదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మందులు, ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కుక్క కరిచిన వెంటనే.. కరిచిన వద్ద సబ్బుతో శుభ్రంగా కడగాలని, అనంతరం వైద్యులను సంప్రదించాలన్నారు. ఇన్‌ఫెక్షన్ కాకుండా తగిన నివారణ చర్యలు చేస్తారని తెలిపారు.

గురుకుల విద్యార్థులకు ఐఐటీ, నీట్ కోచింగ్

అనంతపురం విద్య, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమశాఖలో ఇంటర్ చదివి ఉత్తీర్ణులయిన విద్యార్థులకు ఐఐటీ, నీట్ లాంగ్‌టర్మ్ కోచింగ్ ఇవ్వనున్నట్లు గురుకులాల జిల్లా సమన్వయాధికారి జయలక్ష్మి తెలిపారు. ఈ మేరకు ఆమె సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విజయవాడలోని అంబేడ్కర్ స్టడీ సర్కిల్‌లో ఉచిత కోచింగ్‌తో పాటు భోజన వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు. లాంగ్‌టర్మ్ కోచింగ్ తీసుకోవానుకునే విద్యార్థులు నేరుగా కార్యాలయంలోగానీ, 9949354106 ఫోన్ నెంబర్‌నుగానీ సంప్రదించవచ్చని డీసీఓ తెలిపారు.

'విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి'

అనంతపురం విద్య, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యల పరిష్కారానికే జిల్లాలో జీపుయాత్ర చేపట్టినట్లు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసన్నకుమార్ తెలిపారు. సోమవారం టవర్‌క్లాక్‌వద్ద గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి జీపు యాత్రను ప్రారంభించారు. అక్కడి నుంచి కేఎస్ఆర్ బాలికల కళాశాలకు వెళ్లి విద్యార్థులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చూపుతోందన్నారు. హాస్టల్ విద్యార్థులకు పాత ధరలే అమలు చేస్తుండడంతో మెనూ సక్రమంగా అమలు చేయడంలేదని, నాణ్యమైన భోజనం అందకుండా పోతోందని అన్నారు. అనేక జిల్లాల్లో హాస్టల్ భవనాలు శిథిలావస్థకు చేరినా పట్టించుకోలేదన్నారు. కేజీబీవీలు, గురుకులాలు సమస్యలకు నిలయాలుగా మారాయని తెలిపారు. కళాశాలలో బోధన చేయడానికి లెక్చరర్లు లేరని మండిపడ్డారు. కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజుల రూపంలో తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని, ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికే జిల్లాలో జీపుయాత్ర చేపడుతున్నామని పేర్కొన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్ మాట్లాడుతూ.. అనంతపురంలో జీపుయాత్ర మొదలు పెట్టి గార్లదిన్నె, శింగనమల మీదుగా తాడిపత్రికి చేరుకుంటుందన్నారు. యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గిరి, నాయకులు శివ, భీమేష్, సూర్య ప్రకాష్, వంశీ, రషీద్, విజయ్, జయవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రా బౌలర్లు అదుర్స్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): సీకే నాయుడు అండర్-23 క్రికెట్ టోర్నీలో ఆంధ్రా జట్టు బౌలర్లు అదరగొట్టారు. అనంతపురం క్రీడా మైదానంలోని రాయలసీమ క్రికెట్ గ్రౌండ్‌లో జరుగుతున్న మ్యాచ్ రెండో రోజు ఒడిశా బ్యాటర్లను కట్టడి చేశారు. ఓవర్‌నైట్ స్కోరు 268-4తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఒడిశా జట్టు భారీ స్కోరుపై కన్నేసింది. ఆంధ్రా బౌలర్లు రాజు 3, సుమిత్, ఆదిత్యరెడ్డి చెరో 2, కమిల్, హేమంత్‌రెడ్డి, సాయిశ్రావణ్ వికెట్ తీయడంతో 337 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ నియాన్ శ్యామ్ కంగయాన్ ఓవర్‌నైట్ స్కోరు 131కి మరో 10 పరుగులు జోడించి, అవుటయ్యాడు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆంధ్రా జట్టు ఆట ముగిసే సమయానికి 68 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 184 పరుగులు చేసింది. తేజ సెంచరీ (105)తో చెలరేగాడు. అభినవ్ (44) హాఫ్ సెంచరీకి చేరువయ్యాడు.

10న రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికలు

పుట్టపర్తి టౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ శ్రీ సత్యసాయి జిల్లా బ్రాంచ్‌కు ఈనెల 10వ తేదీన ఎన్నికలు నిర్వహిస్తామని డీసీఓ క్రిష్ణా నాయక్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పుట్టపర్తి గణేష్ సర్కిల్‌లోని జిల్లా సహకార కార్యాలయంలో ఉదయం 11 గంటలకు జిల్లా కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ అధ్యక్షతన ఎన్నికలు నిర్వహిస్తామని ఆయన వివరించారు. పోషకులు, ఉప పోషకులు, జీవితకాల సభ్యులు, అనుబంధ సభ్యులు తమ ఆధార్ కార్డు, సభ్యత్వ గుర్తింపు కార్డుతో హాజరై ఎన్నికల్లో పాల్గొనాలని ఆయన సూచించారు.

జిల్లా జట్ల ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ అండర్-14 బాలుర క్రికెట్ జట్టు, అథ్లెటిక్స్ క్రీడాకారులను ఎంపిక చేశారు.స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో సోమవారం ఎస్‌జీఎఫ్-14 అథ్లెటిక్ బాల, బాలికల క్రీడాకారుల ఎంపిక పోటీలు, ఆర్డీటీ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ అండర్-14 బాలుర జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారుల వివరాలను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. అథ్లెటిక్ బాలురలో శ్రీనాథ్, రితీష్‌రెడ్డి, యశ్వంత్, పవన్, లోకేష్, సమరసింహ, ఆనంద్ ఎంపికయ్యారు. బాలికల విభాగంలో దేవిక, భవ్య, రిధి, అవంతి, గగన, నందక్ష, హేమశ్రీ అర్హత సాధించారు. ఎస్‌జీఎఫ్-14 బాలుర జట్టుకు అక్రమ్, జగదీష్‌యాదవ్, తన్వీర్, తోఫిక్, తమోఘ్న, సమృతన్ కన్నన్, అభినవ్, దీపక్, స్నేహిత్ సింహ, లలిత్‌కిషోర్, పవన్, రామ్‌చరణ్, చరణ్‌తేజ్, కౌశిక్‌కుమార్, మోహిత్‌రెడ్డి, క్రితిన్ కార్తికేయ ఎంపికయ్యారు. ఎంపికైన జట్లు ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు. శకుంతల, లక్ష్మీనారాయణ, సుహాసిని, పీడీలు రవీంద్ర పాల్గొన్నారు.

రుణాల రికవరీ సొమ్ము స్వాహా

- రూ.30 లక్షలకుపైగా కాజేసిన బ్యాంకు బిజినెస్ కరస్పాండెంట్
- ప్రసన్నాయపేటలో ఆలస్యంగా వెలుగులోకి..
- బ్యాంకు, వెలుగు అధికారుల విచారణలో బట్టబయలు

చెన్నేకొత్తపల్లి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పొదుపు మహిళల రుణాలకు సంబంధించి రికవరీ సొమ్మును ఓ బ్యాంకులో పనిచేసే ప్రైవేటు ఉద్యోగి కాజేసిన సంఘటన మండలంలోని ప్రసన్నాయపేటలో ఆలస్యంగా వెలుగుచూసింది. దీంతో స్థానికులు తమకు జరిగిన అన్యాయం గురించి బ్యాంకు అధికారులకు ఫిర్యాదు చేశారు. వివరాల మేరకు.. ప్రసన్నాయపేట గ్రామంలో మొత్తం 10 మహిళా సంఘాలు ఉన్నాయి. అందులో కనుముక్కలలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో పొదుపు సంఘాల మహిళలు లావాదేవీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో బ్యాంకులో గ్రూపుల వారిగా తీసుకున్న రుణాలకు సంబంధించి రికవరీ సొమ్మును అదే గ్రామానికి చెందిన బ్యాంకులో బిజినెస్ కరస్పాండెంట్‌గా పనిచేస్తున్న క్రిష్టారెడ్డికి నెలనెలా కంతుల వారీగా చెల్లిస్తున్నారు. రుణాల రికవరీ విషయమై సంబంధిత వెలుగు సీసీ రమేశ్ గ్రూపుల వారీగా ఆన్‌లైన్‌లో తనిఖీలు చేయగా గుట్టు రట్టయింది. 2023 సంవత్సరం నుంచి రుణాల రికవరీ సొమ్ములో కొంత మొత్తాన్ని బ్యాంకు ఖాతాలో జమచేయకుండా పక్కదారి పట్టించాడని గుర్తించారు. దీంతో పొదుపు మహిళలు తమకు జరిగిన అన్యాయం గురించి వెలుగు సిబ్బందితో కలిసి బ్యాంకు అధికారుల వద్దకు వెళ్లి బిజినెస్ కరస్పాండెంట్ క్రిష్టారెడ్డిపై ఫిర్యాదు చేశారు.


పొదుపు మహిళలను విచారిస్తున్న ఏపీ గ్రామీణ బ్యాంకు, వెలుగు అధికారులు

తాము ప్రతినెలా కంతులు చెల్లిస్తున్నామని, అప్పు చెల్లింపు ఖాతాలో జమచేయకుండా కాజేశారని వాపోయారు. వారి ఫిర్యాదు మేరకు బ్యాంకు రీజనల్ అధికారులు కనుముక్కల బ్యాంకు ఇన్‌చార్జ్ మేనేజర్ జ్యోతి, డీఆర్‌డీఏ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సత్యనారాయణ, వెలుగు ఏపీఎం నాగేంద్ర సోమవారం గ్రామానికి వెళ్లి విచారణ చేశారు. స్థానిక రామాలయంలో ఒక్కో గ్రూపు వారీగా 10 గ్రూపులకు సంబంధించిన మహిళలను విచారించగా రూ.30.75 లక్షలు సొమ్ము కాజేసినట్టు తేటతెల్లమైంది. బిజినెస్ కరస్పాండెంట్ నుంచి కాజేసిన సొమ్మును రికవరీ చేస్తామని, ఆందోళన చెందవద్దని అధికారులు తెలిపారు.

విధేయతకు పట్టం!

- రెండు దశాబ్దాల పనితీరుకు గుర్తింపు
- ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యుడిగా వెంకటప్ప

అనంతపురం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): టీడీపీలో కార్యకర్తకు గుర్తింపు దక్కింది. రెండు దశాబ్దాలుగా పార్టీ పట్ల చూపిన విధేయతను అధిష్ఠానం గుర్తించింది. టీఎన్ఎస్ఎఫ్, తెలుగు యువత నాయకుడిగా అనేక కార్యక్రమాలు నిర్వహించిన సామాన్య కార్యకర్త వెంకటప్ప రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడిగా నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. గుంతకల్లు నియోజకవర్గంలోని గుత్తి మండలం ఎర్రగుడికి చెందిన వెంకటప్ప 2003లో టీడీపీలో చేరాడు. క్రియాశీలక కార్యకర్తగా పని చేస్తూ, పార్టీ అనుబంధ విభాగం టీఎన్ఎస్ఎఫ్ ఆవిర్భావం నుంచి ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా రెండు పర్యాయాలు పనిచేశాడు. ఉమ్మడి జిల్లా టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా దాదాపు పదేళ్లపాటు వెంకటప్ప పనిచేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, టీఎన్ఎస్ఎఫ్ కర్నూలు జిల్లా ఇన్‌చార్జ్‌గా పనిచేశారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా విద్యార్థి, యువత సమస్యల పరిష్కారం కోసం ఎన్నో ఉద్యమాలు చేశారు. పోలీసు లాఠీల దెబ్బలు తిన్నారు. వైసీపీ పాలనలో అనేక అక్రమ కేసులను ఎదుర్కొన్నాడు. వెంకటప్పపై 28 కేసుల దాకా ఉన్నాయి.

యువగళంలో..: టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ సార్వత్రిక ఎన్నికలకు ముందు చేపట్టిన యువగళం పాదయాత్రలో వెంకటప్ప భాగస్వామి అయ్యాడు. పాదయాత్ర ముగింపు వరకూ లోకేశ్ వెన్నంటే నిలిచారు. ఈక్రమంలో గిరిజనులతో లోకేశ్ నిర్వహించిన ముఖాముఖిలోనూ వెంకటప్ప పాల్గొన్నాడు. మంత్రి నారా లోకేశ్‌కు సన్నిహితుడిగా మెలుగుతూ వచ్చాడు. ఈ పరిణామాల నేపథ్యంలోనే ఆయనకు మంచి పదవి దక్కింది.


మంత్రి నారా లోకేశ్‌తో వెంకటప్ప

ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యుడిగా నియమితులైన క్రమంలో... వెంకటప్ప 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ఒక పేద కుటుంబానికి చెందిన తాను పార్టీ కోసం అనేక కష్టనష్టాలకు ఓర్చి పనిచేస్తూ వచ్చానన్నారు. పార్టీ సిద్ధాంతాన్ని నమ్ముకొని పనిచేశానని, తన పని తీరును అధిష్ఠానం గుర్తించి పదవి ఇచ్చిందన్నారు. ఈ పదవి ఇచ్చినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, రాష్ట్ర ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్‌లకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నట్లు వెల్లడించారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా గిరిజనుల సమస్యలు పరిష్కారమే అజెండాగా పనిచేస్తానని తెలిపారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం క్రైం/పుట్టపర్తిరూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో మద్యం దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తులు కోరుతున్నట్లు రెండు జిల్లాల ఎక్సైజ్ సూపరింటెండెంట్లు రామ్మోహన్‌రెడ్డి, గోవిందనాయక్ సోమవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. అనంతపురం జిల్లాలో తాడిపత్రి మున్సిపాలిటీలో 3, గుత్తి రూరల్ మండలంలో రెండు, కళ్యాణదుర్గం మున్సిపాలిటీలో ఒకటి, పామిడి మండలం, పెద్దవడుగూరు మండలంలో ఒకటి చొప్పున ఓపెన్ కేటగిరీ దుకాణాలు ఉన్నట్లు వెల్లడించారు. శ్రీసత్యసాయి జిల్లాలో మొత్తం 9 మద్యం షాపులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. మడకశిర, హిందూపురం, సీకేపల్లి, ధర్మవరం, పుట్టపర్తి ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. గీత కులాలకు రిజర్వేషన్ కేటగిరీలో అనంతపురం జిల్లాలో మూడు దుకాణాలకు దరఖాస్తులు కోరుతున్నామన్నారు. ఇందులో కంబదూరు మండలంలో ఒకటి, రాయదుర్గం మున్సిపాలిటీలో రెండు దుకాణాలు ఉన్నాయన్నారు. దరఖాస్తు రుసుం కింద రూ. 2 లక్షలతో డీడీ(నాన్ రీఫండబుల్) తీసి, దరఖాస్తుకు, ఆధార్ కార్డు జత చేసి మాన్యువల్‌గా జిల్లాలోని అన్ని ఎక్సైజ్ స్టేషన్లలో అందజేయవచ్చునన్నారు. ఈనెల 10వతేదీ సాయంత్రం 5 గంటల్లోగా ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేయవచ్చునని వారు తెలిపారు. ఈనెల 12న ఆ జిల్లాల కలెక్టరేట్‌లో కలెక్టర్ల ఆధ్వర్యంలో లాటరీ తీస్తామని వారు పేర్కొన్నారు.

శ్రీకాళహస్తి ఆలయ డైరెక్టర్‌గా ప్రమాణ స్వీకారం


డైరెక్టర్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న లక్ష్మీనారాయణ

కొత్తచెరువు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి ఆలయ ట్రస్టు డైరెక్టర్‌గా కొత్తచెరువు గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ లక్ష్మీనారాయణ సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనను ఆలయ చైర్మన్ సాయిప్రసాద్ ఆధ్వర్యంలో ఈఓ బాపిరెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆలయ విశిష్టత గురించి పురోహితులు వివరించారు. అనంతరం లక్ష్మీనారాయణ దంపతులకు శాలువాకప్పి సన్మానించారు. కార్యక్రమంలో సినీ నటుడు నారా రోహిత్, టీడీపీ నాయకుడు సంతోష్, మండల కన్వీనర్ రామకృష్ణ, బండ్లపల్లి రాజు, వైవీ మురళీచౌదరి, సందీప్ పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌లో స్టేట్ ఫస్ట్


షాజియాబాను

హిందూపురం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థి షాజియాబాను రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించినట్లు హిందూపురం పాలిటెక్నిక్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి నాయుడు తెలిపారు. ఆ విద్యార్థి 1000/990 మార్కులు సాధించినట్లు వెల్లడించారు. తమ కళాశాల నుంచి 900కుపైబడిన మార్కులు ఎనిమిది మంది సాధించారన్నారు. ఎస్.అమీనతస్లీం 969, గ్రీష్మసాయిరెడ్డి 962, సానియా సుల్తానా 962, అఫ్రీనబాను 943, అర్పియ 933, శశిస్తాబాను 923, పూజ 922, ముతహీర 921, సుఫియాసార 906 మార్కులు సాధించారని తెలిపారు.

శాంతినారాయణకు జీవన సాఫల్య పురస్కారం


పురస్కారం అందుకుంటున్న శాంతినారాయణ

అనంతపురం టౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన సీనియర్ రచయిత, విమలాశాంతి సాహిత్య సామాజిక సేవాసంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ శాంతినారాయణ అమృతలత జీవన సాఫల్య పురస్కారం అందుకున్నారు. నిజామాబాద్‌కు చెందిన ఇందూరు అపురూప అవార్డ్స్ సంస్థ నిర్వాహకులు 2024, 2025 సంవత్సరాలకు సంబంధించి ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వివిధ ప్రాంతాలనుంచి ఆరుగురు సీనియర్ రచయితలను అమృతలత జీవన సాఫల్య పురస్కారాలకు ఎంపిక చేశారు. ఇందులో భాగంగా 2024 సంవత్సరానికి సంబంధించి అనంతపురం జిల్లాకు శాంతినారాయణ జీవన సాఫల్య పురస్కారానికి ఎంపిక చేసిన విషయం తెలిసిందే. సోమవారం నిజామాబాద్ మామిడిపల్లిలోని శ్రీవారి అపురూప కల్యాణమండపంలో నిర్వహించిన పురస్కార ప్రధానోత్సవ సభలో శాంతినారాయణకు సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్ అమృతలత, కథా రచయిత్రి నెల్లుట్ల రమాదేవి, జర్నలిస్టు వల్లీశ్వర్, వెంకటకృష్ణ పురస్కారం అందజేశారు.

నేడు మెగా జాబ్‌మేళా

అనంతపురం రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక కమలానగర్‌లోని శ్రీసాయి డిగ్రీ కళాశాలలో మంగళవారం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ దామోదరరెడ్డి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ విజయ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంటర్, డిగ్రీ, ఫార్మసీ, బీటెక్ విద్యార్థులు, పట్టభద్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

- పెడపల్లి వద్ద స్కూటర్‌ను ఢీకొన్న ఇన్నోవా
- ఇద్దరు వ్యవసాయ కూలీల మృతి
- ముదిగుబ్బ మండలంలో బైకులు ఢీ.. ఒకరి మృతి.. ఇద్దరికి తీవ్రగాయాలు

పుట్టపర్తి రూరల్, ముదిగుబ్బ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అతివేగం రెండు ప్రాణాలను బలిగొంది. పుట్టపర్తి మండలం పెడపల్లి శివారులో సోమవారం సాయంత్రం స్కూటర్‌ను ఇన్నోవా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పెడపల్లికి చెందిన వ్యవసాయ కూలీలు మహేశ్, (30), రంగప్ప(31) మృతిచెందారు. వీరిద్దరూ కూలి పనులు ముగించుకుని స్కూటర్‌పై వస్తుండగా వైఎస్సార్ కాలనీ దాటిన తర్వాత పుట్టపర్తి వైపు నుంచి అతివేగంగా వస్తున్న ఇన్నోవా ఢీకొట్టి, ఆగకుండా వెళ్లిపోయింది. దీంతో తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ స్థానికులు 108 వాహనంలో పుట్టపర్తి సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ ఇద్దరూ మృతిచెందారు. మహేశ్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రంగప్పకు ఇంకా వివాహం కాలేదు. ప్రమాదానికి కారణమైన వాహనం రంగు, రిజిస్ట్రేషన్ నంబరును స్థానికులు పోలీసులకు ఇచ్చారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పుట్టపర్తి రూరల్ ఎస్ఐ లింగన్న తెలిపారు. ప్రమాద స్థలాన్ని ఆయన పరిశీలించారు.


సుబ్రహ్మణ్యం (ఫైల్)

ద్విచక్ర వాహనాలు ఢీకొని..

ముదిగుబ్బ మండల పరిధిలోని రెండు జీమాన్ల సమీపంలో ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు సోమవారం రాత్రి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముదిగుబ్బ సాయినగర్‌కు చెందిన సుబ్రహ్మణ్యం(23) మృతిచెందాడు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సీఐ శివరాముడు తెలిపిన మేరకు, దొరిగల్లు వద్ద గల క్వారీలో ఎక్స్‌కవేటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న సుబ్రహ్మణ్యం, బైక్‌పై ముదిగుబ్బకు వస్తుండగా, దొరిగల్లుకు చెందిన నరేంద్రబాబు, ఎర్రప్ప ముదిగుబ్బ నుంచి మరో బైక్‌పై ఎదురొచ్చారు. రెండు బైకులు వేగంగా ఢీకొనడంతో సుబ్రహ్మణ్యం అక్కడికక్కడే మృతి చెందాడు. నరేంద్రబాబు, ఎర్రప్ప తీవ్రంగా గాయపడ్డారు. వారిని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం నరేంద్రబాబును అనంతపురానికి తరలించారు. పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తాండవేశ్వర లింగానికి ప్రత్యేక పూజలు


లింగానికి అభిషేకం చేస్తున్న రమానందన్

లేపాక్షి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కార్తీక రెండో సోమవారాన్ని పురస్కరించుకుని దుర్గా, వీరభద్రస్వామి ఆలయంలోని చోళరాజులు నిర్మించిన తాండవేశ్వర లింగానికి ఆలయ కమిటీ చైర్మన్ రమానందన్ అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. పవిత్రమైన తాండవేశ్వర లింగానికి ప్రతి సోమవారం భక్తులు ప్రత్యేక అలంకరణలు చేస్తుంటారు. భక్తుల మధ్య తాండవేశ్వర లింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భోగేశ్వరస్వామి ఆలయ జీర్ణోద్ధరణ


అలంకరణలో భోగేశ్వరస్వామి

తాడిమర్రి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిన్నదరి గ్రామంలో గడచిన రెండు రోజులుగా నిర్వహిస్తున్న భోగేశ్వర స్వామి ఆలయ జీర్ణోద్ధరణ కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ముగింపు సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. స్వామివారి జీర్ణోద్ధరణ సందర్భంగా గ్రామస్థులు బంధువులను ఆహ్వానించారు. అనంతరం ఉత్సవాలలో పాల్గొన్న భక్తులకు గ్రామస్థులు, ఆలయ కమిటి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రాతి దూలం లాగుడు పోటీలలో గ్రామస్థులతోపాటు వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో రైతులు తరలివచ్చారు. పోటీలలో గెలుపొందిన తోపుదుర్తి గ్రామానికి చెందిన చెన్నప్పకు రూ.50వేలు, గార్లదిన్నె రామాంజనేయులుకు రూ.40వేలు, బళ్లారి ఎద్దేశ్వరరెడ్డికి రూ.30వేలు నగదుఅందజేశారు.

భర్త కోసం ఆందోళన


భర్త ఇంటి ముందు బైఠాయించిన భార్య

తాడిమర్రి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): తన భర్తను అప్పగించాలంటూ ఓ మహిళ అత్తమామల ఇంటి ముందు ధర్నాకు దిగారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... తాడిమర్రికి చెందిన ఓంకార్(అబి) అదే గ్రామానికి చెందిన హిమబిందు ప్రేమించుకుని ఆరునెలల క్రితం వివాహం చేసుకున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారుల సమక్షంలో పెళ్లిపత్రాలపై సంతకాలు కూడా చేశారు. అప్పటి నుంచి ఓంకార్, హిమబిందు వారి తల్లిదండ్రుల వద్దకు వెళ్లకుండా అనంతపురంలో నివాసం ఉండేవారు. 15 రోజుల క్రితం ఓంకార్ తనకు ఆరోగ్యం సరిగా లేదంటూ తల్లిదండ్రుల వద్దకు వెళ్లి వస్తానని తాడిమర్రికి చేరుకున్నారు. హిమబిందు అక్కడే ఉండి పలుమార్లు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో సోమవారం సాయంత్రం తాడిమర్రికి చేరుకుని ఓంకార్ తల్లిదండ్రులతో గొడవకు దిగింది. తన భర్తను బయటకు పంపాలని దాదాపు గంటపాటు అడిగినా పంపకపోవడంతో ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న వారి ఇంటి ముందు బైఠాయించింది. తన భర్తను తనతో పంపితే చాలంటూ వేడుకుంది. చివరికి పోలీసులు రంగప్రవేశం చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దని.. ఫిర్యాదు చేస్తే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో హిమబిందు ధర్నా విరమించింది.

పేదలందరికీ ఉచిత కంటి వైద్యసేవలు

- ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి చైర్మన్ జీఎన్ రావు


మాట్లాడుతున్న జీఎన్ రావు, పక్కన రఘువీరారెడ్డి

మడకశిర రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పేదలందరికీ ఉచిత కంటి వైద్య సేవలు అందిస్తున్నట్లు ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి చైర్మన్ జీఎన్ రావు తెలిపారు. మండలంలోని నీలకంఠాపురంలో నిర్మించిన ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రిని సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జీఎన్ రావు మాట్లాడుతూ.. నీలకంఠాపురంలో ప్రారంభించినది 25వ కేంద్రం అన్నారు. మాజీ మంత్రి రఘువీరారెడ్డి కుటుంబ సభ్యులు పేదలకు సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో ఆసుపత్రికి స్థలం కేటాయించి, సొంత ఖర్చులతో భవనాలను నిర్మించి ఇచ్చారని తెలిపారు. ఈ కంటి ఆసుపత్రికి సంబంధించి చుట్టు పక్కల గ్రామాల్లో మరో పది ప్రాథమిక కంటి ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కంటికి సంబంధించి వైద్య పరీక్షలు, ఆపరేషన్లు 90 శాతం ఇక్కడే నిర్వహిస్తామని వివరించారు. కార్యక్రమంలో ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వైస్ చైర్మన్ రాజీవ్‌రెడ్డి, డాక్టర్లు తారప్రసాద్ దాస్, రోహిత్ ఖన్నా, మాజీ ఎంపీలు కేవీపీ రామచంద్రరావు, రంగయ్య, పీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, సీడబ్ల్యూసీ సభ్యులు కొప్పలరాజు, మాజీ కేంద్ర మంత్రి జేడీ శీలం, మాజీ ఎమ్మెల్యేలు సుధాకర్, నర్సేగౌడ్, ప్రభాకర్‌రెడ్డి, తిప్పేస్వామి, ఈరన్న, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వయసు చిన్న.. ప్రతిభ మిన్న

- ఇంటర్నేషనల్ ఫిడే చెస్ రేటింగ్‌లో నిహాల్ ప్రతిభ


నిహాల్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): చిన్న వయసులోనే నిహాల్ అనే బాలుడు చెస్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. నగరంలోని తపోవనంలో నివాసం ఉంటున్న రాఘవేంద్రబాబు, పల్లవి దంపతుల కుమారుడు నిహాల్‌నయనంజన్ సంగపట్నం. ఈ అబ్బాయి మూడో తరగతి చదువుతున్నాడు. నిహాల్ ఈ ఏడాదిలోనే చెస్ ఆడడం మొదలు పెట్టాడు. 9 నెలల్లోనే రెండు జిల్లా, రెండు రాష్ట్ర, ఒక ఇంటర్నేషనల్ స్థాయిలో పతకాలు సాధించాడు. ప్రపంచ చదరంగ సమాఖ్య, అఖిల భారత చదరంగ సమాఖ్య సంయుక్తంగా విడుదల చేసిన జాబితాలో ఇంటర్నేషనల్ ఫిడే ర్యాపిడ్ రేటింగ్‌లో నిహాల్ 1505 ర్యాంకు సాధించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. చిన్న వయసులోనే పెద్ద రికార్డు సాధించిన నిహాల్‌కి ఇంటర్నేషనల్ ఆర్బిటార్ ఉదయ్‌కుమార్ నాయుడు, ఏ1 చెస్ అకాడమీ నేషనల్ ఆర్బిటార్ గోవిందరాజులు అభినందనలు తెలిపారు.

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్‌క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్‌డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ.సంప్ర:7382114647
AJA- ATP

గాయత్రి జ్యోతిష్యం
పండిట్ ఎస్.వి.శాస్త్రిగారు 50సం॥లుగా ఆంధ్ర, కర్నాటకలో ప్రసిద్ధి చెందినారు. విద్య, స్త్రీ పురుష ప్రేమ, లగ్నం, సంతానం, స్త్రీ పురుష వశీకరణ, వ్యాపార ఆర్థిక కుటుంబ సమస్యలకు సంప్ర: 9440532926
AJA-ATP

MEDICAL ADMISSIONS
తిరుపతిలోని Dr.VBR కళాశాలలో ఇంటర్ పాస్ అయిన వాళ్ళకి B.Sc.(నర్సింగ్), BPT (ఫిజియోథెరపీ),B.Sc MLT, GNM, డిప్లొమా పారామెడికల్ (అనస్థీషియా, కార్డియాలజీ, క్యాత్ ల్యాబ్, డయాలసిస్, OT,DMLT, మెడికల్ ఇమేజింగ్, ఆప్తాల్మిక్, రేడియాలజీ) కోర్సులు కలవు. సంప్ర: 81850 10001.
AJT -1770

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్ చిన్న ప్రకటన పెద్ద స్పందన

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

చిన్మద ట్రస్ట్ సేవలు అమోఘం

● ఏడీసీసీబీ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి



పోస్టర్లను విడుదల చేస్తున్న ముంటిమడుగు కేశవరెడ్డి

గార్లదిన్నె, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత అయ్యప్ప చిన్మద సేవా ట్రస్ట్ వారు చేస్తున్న సేవలు అమోఘమని ఏడీసీసీబీ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి కొనియాడారు. శబరిమలకు వెళ్లే భక్తులకు ఈనెల 16 నుంచి జనవరి 20వ తేదీ వరకు అక్కడి ఎరిమేలి సమీపంలో గల పేరునాడు, పంబవాలి వద్ద చిన్మద సేవా ట్రస్ట్ వారు అన్నదానం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను ట్రస్టు వారు సోమవారం అనంతపురంలో ఏడీసీసీబీ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి చేత ఆయన నివాసంలో విడుదల చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శమరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తులకు చిన్మద సేవా ట్రస్ట్ వారు అన్నదానం నిర్వహించడం ఆనందంగా ఉందని తెలిపారు. ట్రస్ట్ ట్రెజరర్ పెనచెర్ల బ్యాళ్ల ఈశ్వరయ్య , జాతీయ వైస్ ప్రెసిడెంట్ తమ్మినేని నరసింహ , రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ గార్లదిన్నె రాము, సభ్యులు పాల్గొన్నారు.

రాయితీతో జింక్ పంపిణీకి చర్యలు

శింగనమల, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలో రైతులకు రాయితీతో జింక్ పంపిణీకి చర్యలు చేపట్టనున్నట్లు మండల వ్యసాయాధికారి అన్వేష్‌కుమార్ సోమవారం ప్రకటనలో తెలిపారు. మండలానికి 2 మెట్రిక్ టన్నుల రాయితీ జింక్ అందుబాటులోకి వచ్చిందన్నారు. 10 కేజీల జింక్ బస్తా పూర్తి ధర 663.48 కాగా.. రాయితీతో రూ.563తో ఇస్తామని తెలిపారు. ఒక్కో రైతుకు రెండు బస్తాలు ఇస్తామన్నారు. కావాల్సిన వారు శింగనమల రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలని చెప్పారు.

ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరం



మొక్క నాటుతున్న భవాని రవికుమార్

అనంతపురంరూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కురుగుంటలో గత వారం రోజులుగా ఆర్ట్స్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-2, ఎస్ఆర్ ఎడ్యుకషనల్ సొసైటీ ఆధ్వర్యంలో చేపట్టిన ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరం సోమవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ భవాని రవికుమార్ ముఖ్యఅతిథిగా హాజరై సచివాలయంలో స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తర్వాత ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు సామాజిక స్పృహతో పరిసరాల పరిశుభ్రత, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ విష్ణుప్రియ, ఎస్సార్ ఎడ్యుకేషన్ సొసైటీ వ్యవస్థాపకులు సుంకర రమేష్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా లేకుంటే చర్యలు

● మార్కెట్ అధికారులకు ఎమ్మెల్యే దగ్గుపాటి హెచ్చరిక
● పలు శాఖల అధికారులతో సమీక్ష



ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

అనంతపురం క్రైం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, లేకుంటే చర్యలు తప్పవని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అధికారులను హెచ్చరించారు. స్థానిక తన క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన పలు శాఖల అధికారులతో సమీక్ష జరిపారు. తొలుత వ్యవసాయ మార్కెట్ అధికారులతో మాట్లాడి పలు అంశాలపై చర్చించారు. పశువుల సంత, చీనీ మార్కెట్ నిర్వహణ, రికార్డులు నిర్వహణ తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. మార్కెట్‌కు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. రైతుల నుంచి అదనపు వసూళ్లు వంటివి కనిపించకూడదన్నారు. తాను ఏ క్షణమైనా వచ్చి రికార్డులు తనిఖీ చేస్తానన్నారు. ఎక్కడ తేడా కనిపించినా...సంబంధిత సిబ్బంది, అధికారులపై చర్యలు తప్పవంటూ హెచ్చరించారు. తర్వాత బీసీ సంక్షేమ శాఖ పరిధిలోని వసతి గృహాల వార్డెన్లతో మాట్లాడారు. హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు, వారికి అందుతున్న సేవలపై ఆరా తీశారు. విద్యార్థినుల వసతిగృహాల వద్ద భద్రత ఉంచాలని, వారి రక్షణ కోసం వార్డెన్లు నిత్యం ప్రమత్తంగా ఉండాలని సూచించారు. తర్వాత ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీర్లతో మాట్లాడి ఆసుపత్రుల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం వివిధ సమస్యలపై వచ్చిన ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించి పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యేను కలసి కురుబ సంఘం నాయకులు...


ఉమ్మడి అనంతపురం జిల్లా కురుబ సంఘం నాయకులు ఎమ్మెల్యే దగ్గుపాటిని కలిశారు. ఈనెల 8వ తేదీన కళ్యాణదుర్గంలో జరిగే భక్తకనక దాస విగ్రహావిష్కరణ రావాలని ఆహ్వానించారు.

సంకల్ప దీక్ష పోస్టర్ల విడుదల

అనంతపురం రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి బోయల ఎస్టీ సాధన, హక్కుల కోసం ఈనెల 10న కర్నూలులో ధృఢ సంకల్ప దీక్ష జరగనుంది. అందుకు సంబంధించిన పోస్టర్లను రుద్రంపేటలోని వాల్మీకి భవన్‌లో సోమవారం వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవయ్య విడుదల చేశారు. సంకల్ప దీక్షకు పెద్ద ఎత్తున వాల్మీకిలు హాజరై ఐక్యతను చాటాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు ఇంటి స్థలాలు ఇవ్వాలి

అనంతపురం రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): అర్హులైన ఆటో డ్రైవర్లకు ఇంటి స్థలాలు ఇవ్వాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆమేరకు సోమవారం అనంతపురం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా జిల్లా ప్రధానకార్యదర్శి రాజారెడ్డి మాట్లాడుతూ.. చదువుకున్నా.. ఉద్యోగాలు రాక, వ్యవసాయం మీద ఆధారపడలేక ఎంతోమంది నగరానికి వచ్చి ఆటో డ్రైవర్లుగా మారతున్నారన్నారు. ర్యాపిడో, ఉచితంగా బస్సు ప్రయాణం వంటివి వాటితో ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోతున్నారన్నారు. వారికి ఇళ్లస్థలాలు ఇచ్చి ఇళ్ల నిర్మాణాలకు రూ. 5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్, నగర ప్రధాన కార్యదర్శి కృష్ణుడు, ఆటో డ్రైవర్ల యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాజు, ఉపప్రధాన కార్యదర్శి కృష్ణానాయక్, నగర అధ్యక్షుడు దుర్గాప్రసాద్, పలువురు నాయకులు, ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.



స్వదేశీ వస్తువులను వాడాలి

నార్పల, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో సోమవారం బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాపు రామచంద్రా రెడ్డి ప్రతి ఇంట-స్వదేశీ, ఇంటింటా-స్వదేశీ అనే కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రతిఒక్కరూ స్వదేశీ వస్తువులను వాడాలని సూచించారు. పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు దామోదర్, కాశీవిశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కరువు జిల్లాగా ప్రకటించాలి

నార్పల, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): అనంతపురాన్ని కరువు జిల్లాగా ప్రకటించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నప్పయాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం సంఘం నాయకులతో కలిసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు మధుయాదవ్, సీపీఐ మండల కార్యదర్శి గంగాధర్, మండల సహాయ కార్యదర్శులు నాయకులుపాల్గొన్నారు.

టెట్ నుంచి మినహాయించాలని ప్రధానికి లేఖ

అనంతపురం విద్య, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): సర్వీస్ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ప్రధాని నరేంద్రమోదీకి లేఖ రాసినట్లు ఏపీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపల్లి విజయభాస్కర్ సోమవారం ప్రకటనలో తెలిపారు. టెట్ నుంచి సర్వీస్‌టీచర్లకు మినహాయింపు ఇచ్చేలా పీఎం జోక్యం చేసుకోవాలని లేఖలో కోరినట్లు ఆయన పేర్కొన్నారు.


విద్యాసామగ్రి పంపిణీ

అనంతపురం విద్య, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు సోమవారం ఏజీ శ్రీనివాసరెడ్డి చారిటబుల్ ట్రస్టు వారు విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. ట్రస్టు చైర్మన్ ప్రమీలమ్మ, హెచ్ఎం శ్రీదేవి, టీచర్లు పాల్గొన్నారు.









జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ


ప్రతిభ చాటిన విద్యార్థులు

గుంతకల్లుటౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లాలో ఉరిమళ్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు నెలల క్రితం జాతీయస్థాయి కథల పోటీలను నిర్వహించారు. ఇందులో మండలంలోని తిమ్మాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న జోత్స్న, గత సంవత్సరం పదో తరగతి చదివిన బీ హంపయ్య ప్రతిభ చాటారు. వారికి ఉరిమళ్ల ఫౌండేషన్ పంపిన జ్ఞాపికలు, పుస్తకాలను పాఠశాల హెచ్ఎం నారాయణరెడ్డి సోమవారం అందజేశారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు అక్కాచెల్లెళ్లు


అమూల్య, నందిని

గుంతకల్లుటౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్ర భుత్వ జూనియర్ కళాశాలలో రెండో సంవత్సరం చదువుతున్న అమూల్య, మొదటి సంవత్సరం చదువుతున్న నందిని అక్కాచెల్లెలు. గతవారం అనంతపురంలో నీలం సంజీవరెడ్డి పీటీసీ మైదానంలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్-19 క్రికెట్ జిల్లా సెలక్షన్‌లో వీరు ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 6 నుంచి 8వరకు శ్రీకాకుళంలో రాష్ట్రస్థాయి పోటీలో వీరు పాల్గొంటారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక



పామిడి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక టీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 10మంది విద్యార్థులు ఉరవకొండ, గుంతకల్లు డివిజన్‌స్థాయి పోటీల్లో ప్రతిభచూపి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామ్‌కుమార్ సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఆ విద్యార్థులను సోమవారం అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు సాయిదీప్తి



రాయదుర్గం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక బాలికల హైస్కూల్లో పదో తరగతి విద్యార్థిని శ్రీసాయిదీప్తి ఇటీవల అనంతపురంలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్17 బ్యాట్మింటన్ పోటీల్లో ప్రతిభచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఆమెకు ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ సుగుణమ్మ, ఛైర్మన్ శ్రీనివాసులు ప్రోత్సాహక బహుమతిని సోమవారం అందించారు.

● పుట్లూరు: మండలంలోని కడవకల్లు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నందక్క అథ్లెటిక్, షాట్‌పుట్ విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు మండల విద్యాధికారులు శ్రీదేవి, ప్రేమ్‌కుమార్ సోమవారం తెలిపారు.

అనారోగ్యంతో మహిళ ఆత్మహత్య

గుంతకల్లు టౌన్ నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మోదీనాబాద్ కాలనీకి చెందిన బంటనహాల్ సువర్ణ(45) సోమవారం ఇంట్లో ఉరివేసుకున్నారు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు, కాలనీకి చెందిన కృష్ణ రైల్వే స్టేషన్‌లో టీ విక్రయిస్తుంటాడు. ఆయన భార్య సువర్ణకు రెండేళ్ల క్రితం అపెండిక్స్ ఆపరేషన్ చేయించారు. ఆరు నెలల క్రితం మరో ఆపరేషన్ చేశారు. అప్పటి నుంచి ఆమె కడుపునొప్పితో బాధపడుతున్నారు. ఈ క్రమంలో ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకున్నారు. పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నిండిన శీర్పి చెరువు

బెళుగుప్ప, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): జీడిపల్లి రిజర్వాయర్ పదో పంపుహౌస్ నుంచి గతనెల 25 నుంచి మండలంలోని శీర్పి చెరువుకు హంద్రీనీవా అధికారులు విడుదల చేశారు. ఆ చెరువు సోమవారం నిండటంతో మరువపారింది.

రూ. 7.85 కోట్లతో ఆరోగ్య కేంద్రాలు: విప్


సచివాలయాన్ని ప్రారంభిస్తున్న విప్ కాలవ

రాయదుర్గం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో రూ. 7.85 కోట్లతో గ్రామీణ ఆరోగ్య కేంద్ర భవనాలను నిర్మిస్తామని, అలాగే ఆగిపోయిన నిర్మాణాలను పూర్తి చేస్తామని విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు స్పష్టంచేశారు. సోమవారం బీఎన్ హళ్లి గ్రామంలో గ్రామసచివాలయ భవనాన్ని సోమవారం ప్రారంభించిన ఆయన మాట్లాడారు. వివిధ పద్దుల కింద ఈ పనులను ఏడాది లోపు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కురుబ హనుమంతు, కాటా వెంకటేశులు, మాజీ జడ్పీటీసీ విజయ్‌కుమార్, సోము, వీరేష్ పాల్గొన్నారు.

ప్రైవేటు బస్సుల్లో నిబంధనలు పాటించాలి


బస్సుల యజమానులతో మాట్లాడుతున్న ఎంవీఐ రాజబాబు

గుంతకల్లు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు బస్సుల యాజమాన్యాలు తప్పనిసరిగా భద్రతా చర్యలు పాటించాలని మోటారు వాహనాల తనిఖీ అధికారి ఎన్‌వీ రాజబాబు పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంవీఐ కార్యాలయంలో ప్రైవేటు బస్సుల యజమానులు, ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బస్సుల్లో అత్యవసర ద్వారాల వద్ద సీట్లను ఏర్పాటుచేయరాదని, అవసరమైన సమయాల్లో అద్దాలను పగులగొట్టడానికి రబ్బరు సుత్తులు ఉంచాలని, ఎమర్జెన్సీ ఎగ్జిట్లను తెలిపే బోర్డులను ఉంచాలని తెలిపారు. అగ్ని ప్రమాదాలను హెచ్చరించే ఫైర్ డిటెక్షన్ అలారంను ఉంచాలన్నారు. విద్యార్థులను తరలించే బస్సుల్లో భద్రతపట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. నిబంధనలు పాటించని బస్సులను సీజ్ చేస్తామన్నారు.

థల్ సైనిక్ క్యాంప్



విద్యార్థినిని అభినందిస్తున్న కమాడింగ్ ఆఫీసర్

తాడిపత్రి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆలిండియా థల్ సైనిక్ క్యాంప్‌ను ఎన్‌సీసీ కమాడింగ్ ఆఫీసర్లు రిటైర్డ్, మోనిష్ సుబ్బ స్థానిక శ్రీవాణి హైస్కూల్‌లో సోమవారం నిర్వహించారు. గతంలో ఈ క్యాంప్ ద్వారా శిక్షణ పొందిన ఆ పాఠశాల 9వ తరగతి విద్యార్థి దీక్షితారెడ్డి.. అంచెలంచెలుగా ఎదుగుతూ న్యూఢిల్లీ వరకు వెళ్లి 0.22 రైఫిల్ షూటింగ్‌లో ప్రతిభ కనబరిచారు. దీంతో దీక్షితారెడ్డిని వారు అభినందించారు. తమ పాఠశాల విద్యార్థిని ఈ ఘనత సాధించడం చాలా గర్వకారణమని విద్యాసంస్థల అధినేత గంగాధర్ అన్నారు.

రెండు రోజులుగా నీరు వృథా



బొమ్మనహాళ్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్బీనగర్ గ్రామం వద్ద శ్రీరామిరెడ్డి పథకం తాగునీటి పైపులైన్‌లో హెయిర్ వాల్ నుంచి రెండు రోజులుగా ఇలా నీరు వృథా అవుతోంది. అధికారులకు చెప్పినా ఎవరూ స్పందించ డం లేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న లారీ

గుత్తి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో సోమవారం లారీ ఢీకొనడంతో డివైడర్ మధ్యలో ఉన్న ఓ విద్యుత్ స్తంభం కూలింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లైంది.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

హామీలు నిలుపుకుంటున్నాం: ఎమ్మెల్యే

శెట్టూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): 'ఎన్నికల ముందు ఏ గ్రామానికి వెళ్లినా రోడ్లు నిర్మించాలని గ్రామస్థులు కోరారు. తప్పకుండా నిర్మిస్తామని నాడు హామీ ఇచ్చాం. అధికారంలోకి వచ్చిన యేడాదిన్నరలోనే చాలా వరకు రోడ్లు నిర్మించాం. త్వరలోనే మరిన్ని రోడ్లు మంజూరు చేయిస్తాం. ఇచ్చిన హామీని తప్పకుండా నిలుపుకుంటాం..' అని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పేర్కొన్నారు. మండలం చెర్లోపల్లి ప్రధాన రహదారి నుంచి కైరేవు గ్రామానికి రూ.కోటితో 1.5 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి సోమవారం ఆయన స్థానిక టీడీపీ నాయకులు, అధికారులతో కలిసి భూమిపూజ చేశారు.

ఘనంగా కార్తీక దీపోత్సవం

కూడేరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలం చోళసముద్రం గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో కార్తీక దీపోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. గ్రామ సర్పంచు వడ్డే రమాదేవి పాఠశాల ఆరవణంలోని ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. అనంతరం సహపంక్తి భోజనం ఏర్పాటు చేశారు. ఇందులో స్థానిక టీడీపీ నాయకులు బొగ్గుల మురళి దంపతులు, హెచ్ ఎం మురళి, ఉపాధ్యాయులు, స్థానికులు పాల్గొన్నారు.

సేఫ్టీ పేరుతో డబ్బు వసూలు

పుట్లూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతకుంట గ్రామంలో గ్యాస్ సేఫ్టీ చెకింగ్ పేరుతో లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేశారు. తాడిపత్రిలోని ఓ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు ముందుగా ఆ గ్రామంలో గ్యాస్ సిలిండర్, స్టౌ తనిఖీ చేయించుకోవాలని చాటింపు వేయించారు. ఆదివారం తనిఖీలు చేసిన వారు ఒక్కొక్క లబ్ధిదారు నుంచి రూ.150 వసూలు చేశారు. దీనిపై సీఎస్‌డీటీ రాజాను వివరణ కోరగా.. గ్యాస్ లబ్ధిదారుల నుంచి రూ.150 డబ్బులు తీసుకున్నట్లు ఫిర్యాదు వచ్చిందని, విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కరువు మండలాలుగా ప్రకటించాలి

ఉరవకొండ,నవంబరు3(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అన్నింటినీ కరువు మండలాలుగా ప్రకటించాలని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మధుసూదన్ పేర్కొన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు మహబూబ్‌బాషాకు వినతి ప్రతాన్ని అందజేశారు.

● తాడిపత్రి : తాడిపత్రిని కరువు మండలంగా ప్రకటించాలని సోమవారం తహసీల్దార్ సోమశేఖర్‌కు రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖరరెడ్డి, మండల కార్యదర్శి రాజారామిరెడ్డి వినతి పత్రం అందజేశారు.

● పెద్దవడుగూరు : మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని జిల్లా రైతు సంఘం నాయకుడు దస్తగిరి, రైతులు తహసీల్దార్ ఉషారాణికి వినతిపత్రం అందజేశారు.

రేపటి నుంచి కడ్లే గౌరమ్మ రథోత్సవాలు


కడ్లే గౌరమ్మ అమ్మవారు

విడపనకల్లు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక కడ్లే గౌరమ్మ రథోత్సవ వేడుకలను బుధవారం నుంచి శనివారం వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ పెద్దలు సోమవారం తెలిపారు. రాష్ట్రంలోనే ఎక్కడ లేని విధంగా విడపనకల్లులో గౌరీ దేవి ప్రతిమను (అమ్మవారి తల) శెనగ పిండితో చేసి మూడు రోజులు పూజలు నిర్వహించడం ఇక్కడి ప్రత్యేకత అన్నారు. శనివారం ఉదయం అమ్మవారిని పూల రథంలో ఊరేగించి.. స్థానిక గౌరమ్మ బావిలో నిమజ్జనం చేస్తామని, దీంతో ఈ ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

ఇరువర్గాలపై కేసు

తాడిపత్రి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతకోటలో వైసీపీ, టీడీపీ ఇరువర్గాల నాయకులు కోటిసంతకాల ప్రోగ్రాం, ఇంటింటి ప్రచారంలో భాగంగా ఎదురుపడి ఆదివారం రాళ్ల దాడులు చేసుకున్న విషయం విదితమే. దీంతో ఇరువర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు 30మందిపై కేసులు నమోదుచేసినట్లు సీఐ ఆరోహణరావు సోమవారం తెలిపారు.

ఇంట్లో చోరీ

తాడిపత్రి, నవంబరు3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కృష్ణాపురం 5వ రోడ్డులో నివాసం ఉంటున్న మహమ్మద్‌రఫీ ఇంటిలో చోరీ జరిగింది. తన కుటుంబ సభ్యులతో కలిసి ఊరికి వెళ్లిన మహమ్మద్‌రఫీ.. సోమవారం ఇంటికి తిరిగి వచ్చాడు. ఇంటి తలుపులు పగలగొట్టి ఉండటంతో.. లోనికి వెళ్లి చూశాడు. బీరువాలోని ఒకటిన్నర తులం బంగారు, రూ.15వేలు చోరీ అయినట్లు గుర్తించి.. పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉన్నట్లు పట్టణ సీఐ ఆరోహణరావు తెలిపారు.

క్షుద్రపూజలు చేశారని ఫిర్యాదు

బెళుగుప్ప, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): తన అంగడి ఇంటి ముందు క్షుద్ర పూజలు చేశాడని, తరచూ ఫోన్లో అసభ్యంగా మాట్లాడుతున్నాడని స్థానిక పూలు, పండ్ల వ్యాపారి శకుంతల బెళుగుప్ప తండాకు చెందిన ఉమాపతి నాయక్‌పై సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పలుమార్లు హెచ్చరించినా ఫలితం లేదని, చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

మట్కాబీటర్ల అరెస్ట్

గుత్తి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్పందన ఫంక్షన్ హాల్ వెనుక మట్కా రాస్తున్న ఇద్దరిని సోమవారం అరెస్ట్ చేసినట్లు సీఐ రామారావు తెలిపారు. వారి నుంచి రూ.52.060 స్వాధీనం చేసుకొని.. కేసు నమోదు చేశామన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి


ర్యాలీలో పాల్గొన్న గ్రామస్థులు

కుందుర్పి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాయదార్లపల్లిలో వాల్మీకి జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. వాల్మీకి విగ్రహానికి పూజలు చేశారు. అనంతరం వాల్మీకి చిత్రపటాన్ని గ్రామంలో ఊరేగించారు.

బీటీపీ మూడు గేట్ల ఎత్తివేత

గుమ్మఘట్ట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): భైరవాని తిప్ప ప్రాజెక్టుకు కర్ణాటకలో వాణి విలాస్‌సాగర్ ప్రాజెక్ట్ నుంచి వరదనీరు చేరుతుండడంతో పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకుంది. 1655 అడుగులకు చేరుకోవడంతో ఇరిగేషన్ అధికారులు మూడుగేట్ల ద్వారా రెండువేల క్యూసెక్కుల నీటిని దిగువ హగరికి విడుదల చేశారు. ఇన్‌ఫ్లో రెండువేల క్యూసెక్కుల దాకా కొనసాగుతోందని, యథావిధిగా పైన వస్తున్న నీటిని దిగువకు వదులుతున్నట్లు ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు.

అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి


ఓబులనాయుడి మృతదేహం

పుట్లూరు, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అరకటవేముల గ్రామానికి చెం దిన కొండేటి ఓబులనాయుడు (36) అతిగా మద్యం తాగి సోమవారం మరణించాడు. ఓబులనాయుడు వ్యవసాయంతోపాటు ఐచర్ డ్రైవర్‌గా వెళ్తుండేవాడు. ఆదివారం మద్యం అతిగా తాగి ఇంటికొచ్చి పడిపోయాడు. కుటుంబ సభ్యులు అనంతపురం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఓబులనాయుడికి భార్య, కుమారుడు ఉన్నారు.


ఐదుగురికి అవార్డులు


అవార్డు అందజేస్తున్న డీఆర్ఎం

గుంతకల్లు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో చురుకుదనాన్ని, నిబద్ధతను చూపిన ఐదుగురు రైల్వే ఉద్యోగులకు డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా మ్యాన్ ఆఫ్ ద మంత్ అవార్డులను ప్రదానం చేశారు. తన కార్యాలయంలో ఇద్దరు స్టేషన్ మాస్టర్లకు, ఇద్దరు ట్రాక్‌మన్‌కు, ఒక గేట్‌మన్‌కు అవార్డులను సోమవారం ప్రదానం చేశారు. అలాగే ఉద్యోగ విరమణ చేసిన 13 మందికి, గతంలో ఉద్యోగ విరమణ చేసిన ఆరుగురికి సెటిల్మెంటు పత్రాలను డీఆర్ఎం అందజేశారు.

నదిలో చిక్కుకున్న యువకులు

కాపాడిన స్థానికులు


తాడుతో బయటకు లాగుతున్న స్థానికులు

బ్రహ్మసముద్రం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేపులపర్తి సమీపంలో వేదవతి హగరిపై ఆదివారం రాత్రి బీటీ ప్రాజెక్టు గేట్ల నుంచి దిగువకు వచ్చిన నీటి ఉధృతికి రోడ్డు కోతకు గురైంది. సోమవారం తెల్లవారుజామున రాయదుర్గం వైపు నుంచి ఇద్దరు యువకులు బైకుపై వచ్చి ప్రమాదవశాత్తు హగరి నదిలోకి కొట్టుకుపోయారు. కొంతదూరం నీటి ప్రవాహంలో బైకుతోపాటు ఇద్దరు కొట్టుకుపోయి.. అక్కడే బైకు పట్టుకుని నిలబడ్డారు. అటుగా వచ్చిన స్థానికులు గమనించి తాళ్ల సాయంతో వారిని బయట లాగి రక్షించారు.

మంటల్లో బైక్



బొమ్మనహాళ్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) కళ్యాణదుర్గం-బళ్లారి రాహదారిపై మండల కేంద్రం సమీపాన సోమ వారం సాయంత్రం బైక్‌లో ఉన్నఫలంగా మంటలు చెలరేగడంతో అది పూర్తిగా కాలిపోయింది. మండలంలోని ఉంతకల్లు గ్రామానికి చెందిన విజయ్ సరిహద్దులోని బంక్‌లో పెట్రోలు వేయించుకుని, సొంతూరికి వస్తున్నాడు. చెక్‌పోస్టు సమీపాన బైక్ ఇంజిన్ నుంచి పొగ రావడంతో వెంటనే ఆపి దిగేశాడు. క్షణాల్లోనే మంటలు చెలరేగి బైక్ బూడిదైంది.

పరిహారం కోసం పనుల అడ్డగింత

యాడికి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పవర్‌గ్రిడ్ టవర్ల ఏర్పాటులో తమకు నష్టపరిహారం అందించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారంటూ యాడికి, కొట్టాలపల్లి రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం యాడికిలో చేపడుతున్న ఆ పనులను అడ్డుకున్నారు. తమకు పరిహారం అందించకుండా పనులన్నీ పూర్తిచేసుకొని వెళ్లిపోతే ఎవరు బాధ్యత వహిస్తారని రైతులు వారిని నిలదీశారు. తొందరగా డబ్బులు పడేలా చేస్తామంటూ కొందరు పవర్‌గ్రిడ్ సిబ్బంది తమతో డబ్బులు కూడా తీసుకున్నారని రైతులు వాపోయారు.

